


## నెలనెలా నవ్వుల పండగ



**కామెడీ క్లబ్ కథలు** **మల్లాది వెంకటకృష్ణమూర్తి**

### ఇరుగు - పొరుగు

**ఒకప్పుడు** ఇరుగు పొరుగుగా జీవించిన ఇద్దరు ఆడవాళ్ళు చాన్నాళ్ళ తర్వాత మార్కెట్లో కలుసుకున్నారు

"మేం ఇప్పుడు శ్రీనగర్ కాలనీలో ఉంటున్నాం. చక్కటి ఇరుగు పొరుగు."చెప్పింది మొదటావిడ ఉత్సాహంగా.

"మా ఇరుగూ పొరుగూ కూడా చాలా మంచివాళ్ళు దొరికారు" చెప్పింది రెండో ఆవిడ వెంటనే.

"అయితే మీరు గాంధీనగర్ నుంచి మారారా?"

"లేదు.. ఇంకా మీరు ఖాళీ చేసిన పక్కింట్లోనే వుంటున్నాం" గడుసుగా చెప్పింది రెండో ఆవిడ.

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

"నీ జీతం ఎంతనేది నీ స్వవిషయం. దాన్ని గురించి పదిమందికీ గొప్పగా చెప్పనవసరంలేదు" అన్నాడు యజమాని కోపంగా.

"భలేవారే నలుగురికీ చెప్పుకోడానికి నేనంత సిగ్గుమాలినవాడిననుకున్నారా?" ఎదురు ప్రశ్నించాడు నౌకరు.

"నువ్వేం చేశావో తెలుసా? మూడొందల ఏళ్ళనాటి ఆ గాజు పాత్రని ముక్కలు చేసేసావ్" కోపంగా అన్నాడు దూర్వాసరావ్ నౌకర్ని.

"భలేవారే ఏదో కొత్త వస్తువు పగిలిపోయినట్లు అలా కేకలేస్తారెందుకు?" అన్నాడు నౌకరు.

"మీ చేతి రుమాలు బాగానే వుందికదా! ఎందుకలా కోపగిస్తారు?" అన్నాడు లాండ్రీవాడు.

"నేను నీకు వేసింది చేతి రుమాలు కాదు. కాశ్మీర్ శాలువా" పళ్ళు బిగబట్టి చెప్పాడా ఆసామీ.

"డార్లింగ్ నిన్న ఓ లక్షాధికారి కూతురి సంబంధం వచ్చింది నాకు. కానీ, నిన్నే ప్రేమిస్తూండబట్టి వద్దుపొమ్మన్నాను. ఇప్పుడు చెప్పు నీ సౌఖ్యం కోసం ఇంకా ఏం చేయగలను నేను?" అన్నాడు ప్రియుడు.

"ఆ లక్షాధికారిని నాకు పరిచయం చెయ్యి" అంది ప్రియురాలు.

"ఒక్క కుర్రాడి హోం వర్క్‌లో ఇన్ని తప్పులుండటం ఎన్నడూ చూడలేదు నేను" అన్నాడు రాముతో టీచర్.

"అవును సార్. ఈ హోం వర్క్ చేయటంలో ఈసారి మా అమ్మే కాక నాన్న, అన్నయ్య, అక్కయ్య, మామయ్య కూడా సహాయం చేశారు మరి."

"నువ్వు మీ ఆవిడతో డబ్బు పెట్టి పేకాట్టం ఏమీ బావుండలేదోయ్"

"మరేం చేయను? నాకొచ్చిన జీతమంతా ఆవిడ చేతుల్లోనే పోస్తాను. నా సొదరు ఖర్చుకు డబ్బు సంపాదించడానికి ఇంత కంటే వేరే మార్గంలేదు."

"మరేం ఫర్వాలేదు. అది చచ్చిన నల్లేకదా? ఇప్పుడు హాయిగా పడుకోండి" అర్ధరాత్రి ఫిర్యాదు చేసిన కష్టమర్‌కు సర్ది చెప్పి పంపేశాడు హోటల్ మేనేజర్.

మరో గంట తర్వాత అదే కష్టమర్ ఫోన్ చేశాడు "అయ్యా! చచ్చిన నల్లి గురించి నేనేం బాధపడడంలేదు. ఇప్పుడు దాని శవయాత్రకై విచ్చేసిన దాని వేలాది సోదరులను చూస్తోంటే గుండె దడగా వుంది. వెంటనే వచ్చి రక్షించండి" అంటూ.

వక్తలంతా దేశ సమైక్యత గురించి ఒకరి తర్వాత మరొకరు ఉపన్యసిస్తున్నారు. ఆఖర్న ఉపన్యసించడానికి లేచిన నాయకుడిని చూసి జనం నవ్వడం మొదలుపెట్టారు. అప్పుడా నాయకుడు మొదలెట్టాడు తన ఉపన్యాసం...

"సోదరులారా! పంజాబులో కూడా నాకిదే పరిస్థితి ఎదురైంది. కాశ్మీరులో కూడా ప్రజలు నన్ను చూసి నవ్వారు. మద్రాసులోనూ అంతే అయింది. కాబట్టి మన దేశంలో వివిధ భాషలవాళ్ళు ఉన్నప్పటికీ సంస్కృతిలో మనమంతా ఒకటేనని తెలుస్తోంది."

"ఏమయ్యా కండక్టరూ విజయవాడ రాగానే నన్ను నిద్రలేపమని చెబితే లేపలేదేం?" విసుగ్గా అడిగాడో బస్సు ప్రయాణికుడు.

"విజయవాడలో లేపమంది మీరా? గేటు పక్కనున్నాయన్ని విజయవాడలో దింపేస్తుంటే ఆయనెందుకలా దిగనని గింజుకున్నాడో ఇప్పుడర్ధమయింది" బుర్రగోక్కుంటూ అన్నాడు కండక్టర్.

"భూమ్మీదా, నీటిలోనూ  కూడా జీవించగల ప్రాణి ఏమిటో చెప్పరా వేణూ?" అన్నాడు టీచర్.

"తాబేలు" చెప్పాడు వేణు.

"వెరీగుడ్. మరొకటి చెప్పు"

"ఇంకో తాబేలు."

COMMENTS